
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్



టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

ఒంటిమిట్ట : జిల్లాలో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్ద టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి అన్బురాజన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ వేడుకగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారని, ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు వస్తున్నారని చెప్పారు. వారికి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించామన్నారు. భక్తులకు, పర్యాటకులకు ఎలాంటి సమస్యలొచ్చినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయం చేస్తారని వివరించారు. ఏదైనా వస్తువులు పోయినా, పిల్లలు తప్పిపోయినా ఫిర్యాదు చేయాలన్నారు. స్టేషన్‌లో ఎస్ఐ, ఆరుగురు సిబ్బంది ఉంటారని చెప్పారు. టిటిడి అనుసంధానం చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కడప డిఎస్‌పి, ఒంటిమిట్ట సిఐ పురుషోత్తమరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సిద్ధవటం ఎస్ఐ నాగతులసిప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

ఆలకిస్తారా?



- చక్కెర పరిశ్రమకు మోక్షమేదీ
- ప్రశ్నార్థకంగా కడప రోడ్ల విస్తరణ
- అటకెక్కిన స్ట్రోమ్‌డ్రెయిన్ల హామీ
- జిజిహెచ్‌లో సూపర్‌స్పెషాలిటీ సేవలేవీ?
- 'ఆర్కిటెక్చర్' నిర్మాణ పనులకు మోక్షమెప్పుడో
- నేడు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వ్యవసాయాధారిత ఆర్థికాభివృద్ధికి వెన్నెముక చెన్నూరు సహకార చక్కెర పరిశ్రమ. అటువంటి వ్యవసాయ అనుబంధ పరిశ్రమ పునరుద్ధరిస్తానని ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సాక్షిగా ఇచ్చిన హామీ నీరోడుతోంది. ప్రతిపక్ష నాయకుని హోదా నుంచి నేటి వరకు జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి హోదాలో చేసిన శంకుస్థాపనల వరకు నిధుల విడుదల, పెండింగ్ పనుల పురోగతికి ఇచ్చిన హామీలు అమలుకు ఆమడదూరంలో ఉన్నాయని చెప్పకోవచ్చు. కడప నగరంలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. కడప నగరంలోని నాలుగు స్ట్రోమ్‌వాటర్ డ్రైయిన్లు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ భవన నిర్మాణ ఏర్పాటు, జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ సేవలు అమలుకు ఆమడ దూరంలో నిలవడం తెలిసిందే. రూ.454కోట్ల జిజిహెచ్ బోధనాస్పత్రి, సైక్రియాటిక్, క్యాన్సర్‌బ్లాక్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనులు, రాజీవ్ పార్క్ పనులు, కొప్పర్తి పైప్‌లైన్ పనులు, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, గోపవరంలో సెంచూరి ప్లైవుడ్ పరిశ్రమలు, అడుగు ముందుకు పడని వైనం నెలకొంది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో కథనం.

చెన్నూరు చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు హామీ అటకెక్కింది. మూడు కమిటీలు ముచ్చటగా సర్వే చేసినప్పటికీ ఒటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. గత పర్యటన సందర్భంగా పరిశ్రమ ఉద్యోగులకు సంబంధించిన రూ.16 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేసి, పునరుద్ధరణ పనుల పట్ల ఉదాసీనత వ్యక్తం చేయడం ఆందోళన కలిగిస్తోంది.

➡ 2007లో దీ.శే మాజీ ముఖ్యమంత్రి అప్పటి వైఎస్ సర్కారు తల పెట్టిన రూ.72 కోట్ల తో కడపలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థ పెండింగ్‌లో పడింది. రాంకీ కాంట్రాక్టు సంస్థ టెండరును దక్కించుకుంది. 2015 నాటికి 68 శాతం పనులు పూర్తి చేసింది. ఇరిగేషన్, ఆర్ అండ్‌బి శాఖల అవాంతరాల నేపథ్యంలో చేతులెత్తేసింది. టిడిపి సర్కారు 2018లో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 108.41 కోట్లతో భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థ కాంట్రాక్టును దక్కించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోయింది.

➡ రూ.305 కోట్లతో కడపలోని అన్నమయ్య సర్కిల్, గోకుల్ లాడ్జి సర్కిల్, మాసాపేట సర్కిల్, వైజంక్షన్ సర్కిల్‌లోని రహదారుల విస్తరణ పనులు టెండర్ల దశను దాటడం లేదు.

➡ రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్ డ్రయిన్‌ ఏర్పాటు హామీ అటకెక్కింది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి నగరం ముంపుగుతోంది. ఈనేపథ్యంలో కడపలో స్ట్రోమ్‌డ్రెయిన్ కాల్వల ఆధునీకరణకు సంబంధించిన విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ నిధులు లేక నీరోడుతోంది.

➡ రూ.454 కోట్ల విలువ కలిగిన జిజిహెచ్ బోధనాస్పత్రి, కేన్సర్, సైక్రియాటిక్, సూపర్ స్పెషాలిటీ హోదా పనులు సా..గుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.

➡ రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు ఆర్కిటెక్ట్ దశను దాటలేదు. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పుడనేది తెలియడం లేదు. ఎప్పటికి సాకారమవుతుందో తెలియని దుస్థితి దాపురించింది.

➡ రూ.12 కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్న వైనం నెలకొంది.

➡ రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటిపైప్ లైన్ పనులపై అయోమయం నెలకొంది. కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు నీటి కొరత కారణంగా జంకుతోంది. కొప్పర్తి పారిశ్రామికవాడలోని వైఎస్‌ఆర్ క్లస్టర్లో ఏర్పాటు చేసిన పరిశ్రమలు ఎప్పటికి కార్యకలాపాలు ప్రారంభిస్తాయో తెలియడం లేదు. చెప్పుకోదగిన రీతిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చిన దాఖలా లేవు.

➡ కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాల పరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా పునరుద్ధరణ కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

➡ కడపలో రెండవ ఆర్టీసీ బస్టాండ్ సదుపాయాలు అందని ద్రాక్ష చందంగా ఊరిస్తుండడం గమనార్హం. జిల్లావాసే ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి రావడంతో ఆశాభావం వ్యక్తమవుతోంది.

➡ రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరీకి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ఆశించిన రీతిలో సాగలేదు. బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ వంటి పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

➡ జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ, రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. ఇటీవల జిల్లా నీటిపారుదలశాఖ రూ.212 కోట్ల తో కూడిన ప్రతిపాదనలు పంపించినప్పటికీ పాలనా పరమైన అనుమతుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

➡ అన్నమయ్య రిజర్వాయర్ రూ.777 కోట్ల తో కూడిన పునరుద్ధరణ ప్రక్రియ టెండర్ల దశను దాటడం లేదు. పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు ఆచరణకు నోచుకోవడం లేదు.

సిఎం జగన్ జిల్లా పర్యటన ఇలా..

ప్రజాశక్తి- కడప

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10.15 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. రోడ్డు మార్గాన బయలుదేరి భూమి పూజ చేసే స్టీల్ ప్లాంట్ స్థలానికి చేరుకుని 11.15 గంటల నుంచి 11.30 గంటల వరకు జెఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. 11:35 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి స్టీల్ ప్లాంట్ సైటుకు చేరుకుంటారు. 11. 45 గంటలకు స్టీల్ ప్లాంట్ మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహిస్తారు. అనంతరం అక్కడ నుండి బయలుదేరి 1.40 గంటలకు పులివెందుల చేరుకుంటారు. మధ్యాహ్నం 2.00 నుండి 2.15 గంటల వరకు పులివెందుల ఎస్‌సిఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మూలి బలరామిరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. 3.10 గంటలకు గంటలకు కడప విమానాశ్రయం చేరుకుని విమానంలో గన్నవరానికి బయలుదేరుతారు.

విఆర్‌ఎల ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

- యూనియన్ గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

విఆర్‌ఎలకు వెంటనే ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం రాకమునుపు, వచ్చిన వెంటనే జీతం పెంచుతామని ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించిన సందర్భంలో విఆర్‌ఎలకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దాదాపు నాలుగు సంవత్సరాలు దాటినా వేతనం పెంచలేదని వాపోయారు. పైగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్‌ఎలు గ్రామాలలో పోలీసులాగా ఉంటారని, వారందరూ చదువు లేని వారు, సెల్‌ఫోన్లు వాడనటువంటి వారు, కొందరు చదువుకున్న వారూ ఉన్నారని తెలిపారు. వారందిరకీ ఫేస్ యాప్ పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీయడం శోచనీయమన్నారు. వెంటనే ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. డిఎ రికవరీని వెంటనే ఆపాలన్నారు. కరోనా నేపథ్యంలో ప్రతి విఆర్‌ఎ వద్ద రూ.2 వేలు తీసుకున్నారని, ఆ డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని కోరారు. సంవత్సరాల తరబడి నామినీలుగా జిల్లాలో అనేక మంది విఆర్‌ఎలు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరినీ ఉద్యోగులుగా గుర్తించి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానమైన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రీ సర్వేలో ప్రభుత్వం చేపట్టే పథకాలు, డిపార్ట్‌మెంట్‌లో చేసే పనిలో విఆర్‌ఎల పాత్ర ఉందని తెలిపారు. సమస్యలన్నీ పరిష్కరించకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వీటన్నిటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.. శ్రీనివాసల రెడ్డి, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఆశా జిల్లా కార్యదర్శి రాజామణి, మున్సిపల్ నగర అధ్యక్షులు ఎస్. రవి, ఆటో నాయకులు తార, వీఆర్‌ఎ నాయకులు నాగేంద్ర, నాగేష్, వెంకటపతి, అశోక్, రాజు, హరి నరసింహ, రజిని, ప్రసాదు మునయ్య, నరసింహ, రెడ్డి వరప్రసాద్, జనార్ధన్, హరిబాబు, శివయ్య, రాజన్న కె. వెంకటసుబ్బయ్య, ఎ.వెంకటసుబ్బయ్య, యోహాన్, అరుణ్ బాబు, సంజీవ రాయుడు, అశోక్,చిన్న వెంకటసుబ్బయ్య, పాలయ్య, వెంకటేశు, మనోహర్, సుబ్బయ్య జిల్లా వ్యాప్తంగా వీరి వీఆర్‌ఏలు, వీఆర్‌ఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు ఆటో వారు, సిఐటి నాయకులు, రంగాల నాయకులు, ఆశ, ఆటో, మున్సిపల్ నాయకులు మద్దతు తెలిపారు.



ధర్నాలో మాట్లాడుతున్న మనోహర్

బస్టాండ్ల ప్రయివేటీకరణను ప్రతిఘటిస్తాం

సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్
ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఆర్టీసీ బస్టాండ్లను ప్రయివేట్ వ్యక్తులకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టే చర్యలను ప్రతిఘటిస్తామని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యాలయం ఎదుట సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్లను లీజు పేరుతో 33 సంవత్సరాలు పాటు ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వాలని ఆలోచించడం సరైంది కాదన్నారు. సంస్థ నిర్వహణలోనూ, గ్యారేజ్ ఏర్పాట్లలోనూ, బస్సుల కండిషన్ సమర్థవంతంగా ఉంచడంలోనూ కీలకమైన పాత్ర పోషిస్తుందని. అలాంటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌టిసి బస్టాండ్‌లను నిర్వహించడంలో ఇబ్బందులు ఏవి ఎదురవ్వడం అవకాశం లేదన్నారు. అనేక సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధి సాధిస్తూ ముందుకు దూసుకుపోతుందని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహణ పేరుతో ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టాలని ఆలోచించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా మదనపల్లి ఆర్‌టిసి బస్టాండ్‌ను కాంట్రాక్ట్ అప్పజెప్పి చర్యలు ప్రారంభిస్తుందన్నారు. తర్వాత దీన్ని రాష్ట్రమంతా విస్తరించడానికి సిద్ధమవుతుందన్నారు. ముఖ్యమంత్రి, ఆర్టీసీ చైర్మన్ ఇద్దదూ కడప జిల్లా వాసులేనని, వీరిద్దరూ బస్టాండ్ల ప్రయివేటీకరణను నిలుపుదల చేసేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, అదేబాటలో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. తక్షణమే ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పి బస్టాండ్లను మెరుగైన పద్ధతిలో నిర్వహణ ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఫారుక్ హుసేన్, మహబూబ్ తార, రాజమణి, కామేశ్వరమ్మ, సరిత, అన్వర్, వెంకటసుబ్బయ్య, ఒబులయ్య, అలీఖాన్, షాకీర్, రియాజ్, శివ, శశి పాల్గొన్నారు.

ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - కడప

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జెసి సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్‌చంద్, డిఆర్‌ఒ గంగాధర గౌడ్ లతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో నిర్వహించిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో మార్చి 13న . పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణకు సంబంధిత అధికారులు తప్పకుండా హాజరై ఎన్నికలు జరిగే ఆయా మండలాలకు సంబంధించి సెన్సిటీవ్, హైపర్ సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలను వెంటనే గుర్తించాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామగ్రి, స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, సిపిఒ వెంకటరావ్, డ్వామా, డిఆర్‌డిఎ, మెప్మా, ఎపిఎంఐపి పిడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, రామ్మోహన్ రెడ్డి, రవీంద్రా రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదరించాలి : జడ్జి

కడప : ప్రతి ఒక్కరూ నిరాశ్రయులను ఆదరించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. అక్కడ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులు, బిక్షాటన చేసే వారి కోసం, రోడ్డు పక్కన, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రికి కోసం వచ్చే పేదలు, ఒంటరి మహిళల కోసం నిరాశ్రయుల కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు సైతం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ చేయాలి

పోరుమామిళ్ల టౌన్ : ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ చేయాలని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీవెంకటేశ్వర స్కూల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా కార్యక్రమంలో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ, యోగ క్లాసులు నిర్వహించి ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తపోటు, షుగర్, కేన్సర్ తదిత జబ్బులు శారీరక శ్రమ లేకపోవడం, ఆహార నియమాలు సరిగా పాటించకపోవడం వల్ల వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ శారీరక శ్రమతో కూడిన సైక్లింగ్ చేయడం, ఉదయం నడక, యోగా చేయడం వల్ల రక్తపోటు, షుగర్ అదుపులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మలమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ సుకన్య, ఎమ్మెల్పిహెచ్ భార్గవి, ఎఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాటతో బంగారు భవిష్యత్

కడప అర్బన్ : బడిబాటతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని సిఆర్‌పిలు పేర్కొన్నారు. మంగళవారం సమగ్ర శిక్ష, కడప మండల విద్యాశాఖ అధికారుల ఆదేశానుసారం బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించడం కోసం నగరంలోని నాగరాజుపేట ప్రాంతంలో పర్యటించారు. ఇద్దరు బడిబయట పిల్లల్ని గుర్తించి వారిని సిఎస్ఐ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు సుదేవి సమక్షంలో చేర్పించారు. ఈ సందర్భంగా సిఆర్‌పిలు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రతి పేద పిల్లవాడి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు పాఠ్యపుస్తకాల నుంచి విద్యాలయాల్లో అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు ఆదిమూలం శంకర్, కృష్ణ, నాగమణి, కుమారి, జమీలున్నీసా, ఫర్జానా బేగం, హాజీరా భాను, సువర్ణ, మంగమ్మ, వెంకటాద్రి, రామచంద్ర, రామ్మోహన్ పాల్గొన్నారు.

సవాల్‌ను స్వీకరిస్తాం : టిడిపి

కడప అర్బన్ : డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అనుచరులు చేసిన సవాలను తాము స్వీకరిస్తున్నామని క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పి. సురేష్ అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా సమక్షంలో ఈనెల 16న ఉదయం10.30కు ఏడు రోడ్ల వద్ద చర్చించడానికి సిద్ధమన్నారు. అభివృద్ధి చేయడం చేతకాక వాస్తవాలను మాట్లాడిన పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కడప అభివృద్ధిపై సవాల్ స్వీకరణకు డిప్యూటీ సీఎం అంజాద్ బాషా వస్తే మా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి రావడానికి సిద్ధమన్నారు. వైసిపి దృష్టిలో అభివృద్ధి అంటే ఇల్లు కూల్చడం, స్థలాలు కబ్జా, దౌర్జన్యాలు చేయడం, తప్పుడు కేసులు బనాయించడం, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడమేనని చెప్పారు. సమావేశంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగునూరు రాజశేఖర్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి జియాఉద్దీన్, నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, మహమ్మద్, నయాబ్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎప్పుడైనా చర్చకు సిద్ధమే : వైసిపి

కడప : కడప అభివృద్ధిపై టిడిపి నేతల బహిరంగ చర్చ సవాల్ పై వైసీపీ నాయకులు స్పందించారు. సవాల్‌ను స్వీకరిస్తున్నాం, ఈనెల 16నే కాదు, ఎప్పుడైనా తాము చర్చకు సిద్ధమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ పోలీస్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కడప ఎంఎల్ఎ, డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. స్థాయికి తగ్గట్టు ప్రవర్తించి ఆరోపణలు చేస్తే బాగుంటుంది అని హితవు పలికారు. క్యాడర్ లేని వ్యక్తి ఎం.పి సురేష్ అని అన్నారు. వైసిపి హయాంలోనే బుగ్గవంక పరివాహక ప్రాం తాల్లో పేదలకు వాల్ నిర్మించారని చెప్పారు. సమావేశంలో వైసిపి నాయకులు త్యాగరాజు, వినోద్ కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సంపత్ పాల్గొన్నారు.

17 వరకు గ్రహణమొర్రి ఆపరేషన్లు

పోరుమామిళ్ల టౌన్ : ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఎల్‌బి నగర్ సమీపంలో ఉన్న జిఎస్‌ఆర్ ఆస్పత్రిలో ఈనెల 13 నుంచి 17 వరకు ఉచిత గ్రహణమొర్రి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. శిబిరానికి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల నుంచి 33 మంది బాధిత చిన్నారులు వచ్చారు. పిల్లల తల్లిదండ్రులకు డాక్టర్ గీతా సలహాలు, సూచనలిచ్చారు. ఆపరేషన్ అనంతరం పిల్లలను 15 రోజుల పాటు జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. తొమ్మిదేళ్లుగా 2 వేల మంది గ్రహణమొర్రి చిన్నారులకు ఆపరేషన్లు చేయించామని చెప్పారు. ఇలాంటి వారు ఎవరైనా ఉంటే 8333097172లో సంప్రదించాలని కోరారు.

సంజీవయ్య గొప్ప దార్శనికుడు

కడప : దామోదరం సంజీవయ్య గొప్ప దార్శనికుడు అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, పిసిసి డెలిగేట్ బండి జకరయ్య పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సత్తార్, మల్లెం విజయభాస్కర్, తిరుమలేష్, గొర్ల శ్రీనివాసులు, శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, ప్రసాద్ గౌడ్, కనతల ప్రసాద్, లోకేశ్వరి, వెంకట లక్ష్మమ్మ, రత్నం పాల్గొన్నారు.

'వివేకా' హత్య కేసులో సూత్రధారులకు ప్రభుత్వ అండ

కడప అర్బన్ : వివేకానంద రెడ్డి హత్య కేసులో సూత్రధారులను వైసిపి ప్రభుత్వం కాపాడుతుందని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు విమర్శించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత బాబాయి, మాజీ మంత్రి, వై.ఎస్. వివేకానంద రెడ్డిని అతి క్రూరంగా హత్య చేసినా ఇంతవరకు సూత్రధారులను పట్టుకోకపోవడం బాధాకరమన్నారు. దోషులు ఎంతటి వారైనా సిబిఐ కోర్టులో నిలబెట్టాలని అప్పుడే వివేకానంద రెడ్డి ఆత్మకు శాంతి చేకూరుతుందని చెప్పారు.

దర్గా స్థలాన్ని రక్షించుకుంటాం

కడప అర్బన్ : నగరంలోని రామకృష్ణ కళాశాల వద్ద ఉన్న దర్గా స్థలాన్ని రక్షించుకుంటామని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, కమిటీ నాయకులు బాబు బాయ్ మాట్లాడారు. స్థల వివాదం కోర్టులో ఉన్నా అధికార పార్టీ నాయకులు చక చక ఆక్రమణకు పాల్పడుతున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం అంజద్ బాషా కబ్జా విషయం తెలిసి కూడా నివారణకు కృషి చేయకపోవడం దారుణమన్నారు. పోరాటం ద్వారా కబ్జా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కార్యదర్శి రామమోహన్, కమిటీ సభ్యులు ఓబులేసు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ దినోత్సవం

ప్రజాశక్తి - కడప సిటీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

కడప నగర శివార్లోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో మంగళవారం అంత ర్జాతీయ మ్యాక్సిల్లో ఫేషియల్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంత, దవడ ముఖ శస్త్ర చికిత్స విభాగంలో రోగులకు అవగాహన కోసం కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. డెంటల్ ఆస్పత్రిలో నోరు, ముఖ శాస్త్ర చికిత్సలు రీ కన్‌స్ట్రక్షన్ చేసే స్థాయికి ఎదిగి వైద్య రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నామన్నారు. వారం రోజులుగా ఫేస్ పెయింటింగ్, సోప్ కార్వింగ్, షార్ట్ ఫిల్మ్ ప్రమాదాన్ని నివారించడం వంటి వాటిపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వాడకం వంటి వాటి మీద ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. కోవిడ్ సమయంలో 216 మంది 'బ్లాక్ పంగస్' రోగులకు శస్త్ర చికిత్స చేశామన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ మనోహర్ అభినందించామన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, డాక్టర్ జోత్స్న, డాక్టర్ కోటయ్య, డాక్టర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు క్రికెట్ కిట్ వితరణ

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు విష్ణు మోహన్‌రావు చేతుల మీదుగా మంగళవారం క్రికెట్ కిట్టును చెమ్మమియాపేట బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి. మేరీ ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుమోహన్‌రావు మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మహిళా క్రికెట్‌ను అభివృద్ధి చేయాలని, ఇందులో భాగంగానే క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో వారిని మరింతగా ప్రోత్సహించేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. బాలికలు క్రికెట్లో బాగా సాధన చేసి జిల్లాస్థాయి మహిళా జట్టు ఎంపికలకు హాజరు అవ్వాలని కోరారు. స్కూల్ హెడ్మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్లు మాట్లాడుతూ స్కూల్‌కు క్రికెట్ కిట్టును అందజేయడం పట్ల జిల్లా క్రికెటర్ అసోసియేషన్‌కు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

కడప అర్బన్ : పాలకొండ ఆలయ మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి ప్రతి ఏడాది ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి రోజు రక్త దానం చేయడం అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కే సేవా సమితి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 49 సార్లు రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తం ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని చెన్నవరం గట్టు పైనున్న పేదల ఫిర్యాదు మేరకు మాజీ విఆర్ఒ నాగిరెడ్డి భూ కబ్జాపై బద్వేల్ ఆర్‌డిఒ ఆవుల వెంకటరమణ మంగళవారం విచారణ చేపట్టారు. ఆయన మొదటగా మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం చెన్నవరం గట్టు పైన ఉన్న భూ సమస్యపై పేదలు, కబ్జాదారుడితో విడివిడిగా విచారించారు. ఒక వ్యక్తికి ఎన్ని ఎకరాలు ఉండవచ్చని పేదలు ఆర్‌డిఒను అడిగారు. స్పందించిన ఆర్‌డిఒ వారికి క్లుప్తంగా వివరించారు. అనంతరం పేదలు మాట్లాడుతూ 1878లో 44 ఎకరాలు, 1879లో 9 ఎకరాలు విశ్రాంత విఆర్ఒ నాగిరెడ్డి బినామీ పట్టాలు తీసుకుని స్వాహా చేశారని చెప్పారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తమలాంటి పేదలకు అన్యాయం చేశారని వాపోయారు. కబ్జాపై పూర్తి స్థాయిలో విచారించి సమగ్ర నివేదిక ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆయన ఆదేశించారు.

నేడు పులివెందులకు సిఎం జగన్ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం పులివెందులకు రానున్నారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన మూల బలరామిరెడ్డి రిసెప్షన్ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు అశ్విని, రామతేజేశ్వర్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంగళవారం కలెక్టర్ విజయరామరాజు ఎస్ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

మహాశివరాత్రికి అల్లాడుపల్లె దేవళాలు ముస్తాబు

ప్రజాశక్తి - చాపాడు

ఈ నెల 18, 19తేదీల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవళాలు ముస్తాబవుతున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 18న స్వామివారికి అభిషేకం, గ్రామోత్సవం, జాగరణకు భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. 19న రాష్ట్రస్థాయి వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. ఇఒ శ్రీనివాసులు, చైర్మన్ జిటి వెంకటసుబ్బారెడ్డి, అల్లాడుపల్లె సర్పంచ్ జీవం కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లు చేపడుతున్నారు. అల్లాడుపల్లె పురాతన గుడికి సమీపంలో కుందూ నది నీటి ప్రవాహం, ఇతర ప్రాంతాల నుంచి సులువుగా చేరేందుకు అనువైన రవాణా మార్గం వంటి అనుకూల అంశాలు అల్లాడుపల్లె దేవళాలు సొంతం. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై దేవళాలు ఉండడం వల్ల ప్రయాణానికి సౌకర్యంగా ఉంది. మైదుకూరు, ప్రొద్దుటూరు డిపోల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఆయా రోజుల్లో అన్నదాన కార్యక్రమం ఉంటుంది.



అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం

18న శివాలయంలో ఉత్సవాలు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఈనెల 18న శనివారం శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి శంకరబాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలనంతరం సాహిత్య పురాణ పండిట్ బ్రహ్మశ్రీ విద్వాన్ సొట్టు సాంబమూర్తిచే ప్రత్యేక వాఖ్యానం ఉంటుందన్నారు. సాయంత్రం శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

పిహెచ్‌సిలో అధునాతన పరికరాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త హంగులతో వసతులు కల్పించింది. ప్రజలకు ఆస్పత్రిలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వివిధ రకాల పరీక్షలు చేసే అధునాతన వైద్య పరికరాలను మంజూరు చేసి అందుబాటులోకి తెచ్చింది. ఆ మేరకు వైద్యాధికారి కరిష్మా మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూత్ర పిండాలు, కాలేయం, షుగర్, కామెర్లు, సోడియం, పొటాషియం శాతం, యూరిన్‌లో ఇన్ఫెక్షన్, ప్రోటీన్ శాతం వంటి రక్త పరీక్షలు చేసేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బయో కెమిస్ట్రీ అనలైజర్, ఎలక్ట్రోలైట్స్ అనలైజర్, యూరిన్ అనలైజర్ పరికరాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బయో కెమిస్ట్రీ అనలైజర్ పరికరం ద్వారా రక్త నమూనాలు సేకరించి మూత్ర పిండాలు, కాలేయం, పచ్చ కామెర్లు, కామెర్లు, మధుమేహం పరీక్షలు చేయవచ్చన్నారు. ఎలక్ట్రోలైట్స్ అనలైజర్ ద్వారా శరీరంలో అవసరమైన సోడియం, పొటాషియం పరీక్షలు చేయవచ్చునన్నారు. యూరిన్ అనలైజర్ ద్వారా యూరిన్‌లో రక్తం పడడం, షుగర్ లెవెల్, ప్రోటీన్ శాతం, ఇన్ఫెక్షన్ వంటి పరీక్షలు చేస్తారన్నారు. వీటికి సంబంధించిన మందులు ఉచితంగా అందజేయనున్నట్లు ఆమె వివరించారు. ఆరోగ్య కేంద్రంలో ఈ పరీక్షలను ఉచితంగా పొందవచ్చన్నారు. పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కరిష్మా కోరారు.




డాక్టర్ కరిష్మా

సిఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర యువతకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసి, ఇంతవరకు ఎలాంటి నిర్మాణం చేపట్టక పోగా మరోసారి భూమి పూజంటూ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనను ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో అడ్డుకుంటామని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టి మూడేళ్లు దాటినా ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సిఎం సొంత జిల్లా వాసి కావడంతో జగన్ మాయమాటలను నమ్మి జిల్లాలో ప్రజలు 10కి 10 అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టారన్నారు. జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసి మూడున్నర ఏళ్లయినా కనీసం ప్రహరీ నిర్మించలేకపోయారని విమర్శించారు. అలాంటి ముఖ్యమంత్రి మళ్లీ నేడు ఉక్కు ఫ్యాక్టరీకి భూమిపూజ చేయడం మరోసారి ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియావుద్దీన్, తెలుగు యువత నాయకులు యమ్మనూరు ఆంజనేయులు, పల్లా సాయిరాం, ప్రొద్దుటూరు మండలశాఖ ఉపాధ్యక్షుడు షరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లబోతుల నాగరాజు

కొనసాగుతున్న దోస ఎగుమతులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా దోస పంట దిగుబడి ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర జిల్లాలకు దోసకాయలు ఎగుమతి అవుతున్నాయి. రబీ సీజన్‌లో వరి పంట నూర్పిడి అనంతరం విస్తారంగా రైతులు దోససాగును చేపట్టారు. ముఖ్యంగా చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో దోస సాగైంది. సాధారణ రకంతోపాటు, జ్యూస్ రకం దోసకాయలను అధికంగా సాగు చేశారు. చాపాడు మండల పరిధిలో అయ్యవారిపల్లి, రామదాసుపురం, సీతంపల్లె, మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో సరస్వతిపేట, గుంటూరు కొట్టాల, ఖాజీపేట మండలంలో బక్కాయపల్లి, భూమాయపల్లి తదితర గ్రామాల పరిధిలో దోసకాయలు పండించారు. దోస సాగుకు ఎకరాకు రూ.20వేలకు పైగా ఖర్చవుతుందని రైతులు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఎకరాల వరకు దోస సాగులో ఉంది. ప్రస్తుతం పంట దిగుబడి రావడంతో కిలో రూ.25తో అమ్మకాలు చేపడుతున్నారు. గుంటూరు, నెల్లూరు, తిరుపతి తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. టన్ను రూ.13వేలు పలుకుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



చాపాడు వద్ద అమ్మకానికి తరలిస్తున్న దోసకాయలు

'టిడిపి నాయకులపై నిందలు సరికాదు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరన్నది అందరికీ తెలిసినా కూడా వైసిపి నాయకులు టిడిపి నాయకులపైన నిందలు వేయడమేంటని కడప జిల్లా టిడిపి అధ్యక్షుడు లింగారెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివేకానందరెడ్డి హత్యలో నిజానిజాలు ఆలస్యమైనా తేటతెల్లం అయ్యాయన్నారు. నిందితులు ఎవరైనది జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ తెలిసినా గత మూడున్నరేళ్లుగా ఎవరూ నోరు మెదపని పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ బిటెక్ రవి, పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై నిందలు మోపారని తెలిపారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి తన బాబాయ్ హత్యను రాజకీయ లబ్ధి పొందడానికి టిడిపి మీద నిందలు వేశారన్నారు. ఇప్పటికైనా అసలైన నిందితులను అరెస్ట్ చేసి కేసుకు చరమగీతం పాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లాయర్ సుబ్బయ్య, సిద్దయ్య, సుంకర వేణుగోపాల్, ఏసుదాస్, సుబ్బరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : మాజీమంత్రి వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి ఆ కేసుకు చరమగీతం పాడాలని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో రమణారెడ్డి, భూషిరెడ్డి, తులసిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఖదీర్, రాజారెడ్డి, అంకాల్, సురేంద్రరెడ్డి, అలీ, గోపాల్, భాస్కర్, దాషి పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకు భూములివ్వలేమని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి ప్రభుత్వ ధరకు భూములివ్వలేమని అల్లాడుపల్లె, కేతవరం, బద్రిపల్లి, అనంతపురం, లక్ష్మీపేట గ్రామాల రైతులు తహశీల్దార్ సుభానికి విన్నవించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హైవే రహదారికి భూములు ఇవ్వడం వల్ల ప్రధాన జీవనాధారమైన భూములు కోల్పోతామన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం వారు ఇస్తున్న నష్టపరిహారం విలువ బహిరంగ మార్కెట్ విలువ కన్నా చాలా తక్కువగా ఉందన్నారు. అల్లాడుపల్లె పొలంలో హైవే పక్కన బహిరంగ మార్కెట్లో ఎకరా రూ. రెండు కోట్ల వరకు ధర పలుకుతున్నదని, కాస్త లోపల ఉన్న పొలాలు ఎకరాలు రూ.50 లక్షలు వరకు పలుకుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తామంటున్న రూ.10 లక్షల వరకు నష్టపరిహారం ఏమాత్రం ఆమోదయయోగ్యంగా లేదన్నారు. ఉన్నతాధికారులు రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, చెన్నయ్య, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

సైక్లింగ్ శారీరక బరువు, ఒత్తిడిని తగ్గిస్తుంది

- జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆయుష్మాన్ భారత్-ఆరోగ్యమేళా వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ హైస్కూల్ నుండి మంగళవారం సైకిల్ ర్యాలీ, అవగాహనా సదస్సు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికళ మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యకరమైన శారీరక బరువు, ఒత్తిడిని తగ్గించడానికి తోడ్పడుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద ప్రతినెల 14వతేదీ ఆరోగ్యమేళాలో అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆయుష్మాన్ భారత్-ఆరోగ్యమేళా అను అంశంపై తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.గోపీనాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఓబయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేష్, ఎఎన్ఎం సులోచనమ్మ, ఆశా కార్యకర్తలు రమీజ, లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ప్రతి రోజు క్రమం తప్పకుండా సైక్లింగ్, వ్యాయామం చేయడం వల్ల క్యాన్సర్‌ను జయించవచ్చునని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక కేంద్ర డాక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నుంచి సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** అన్ని వయసుల వారు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, డాక్టర్ శ్రీవాణి, సిహెచ్ఒ రాముడు, సూపర్వైజర్ సరస్వతి, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్త్ మేళాలో భాగంగా ప్రభుత్వ వైద్యులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ జెండా ఊపి ప్రారంభించారు.



ఎర్రగుంట్ల : సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలాంటి వైద్య సేవలు అందుతాయో వాటిపై ప్రజలకు అవగాహన కల్పించుటకు ర్యాలీ నిర్వహించినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు జోష్న, నాగార్జున, శ్రీనాథరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని చిలమకూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో డాక్టర్ సురేష్మా, డాక్టర్ సాయిచరిత ఆధ్వర్యంలో ఆరోగ్య మేళా వారోత్సవాలను నిర్వహించారు. మొదటగా చిలమకూరు ప్రధాన రహదారులు వెంబడి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ విజయకుమారి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ఆరోగ్య నియమాలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరిష్మా సూచించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మంగళవారం పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్థానిక బాలుర, బాలికోన్నత పాఠశాలలో డాక్టర్ ఆరోగ్య మేళా వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మనిషికి శారీరక శ్రమ ఎంతో అవసరమన్నారు. చెడు వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మహదేవ, సూపర్‌వైజర్ శోభాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాను పట్టించుకోకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత జిల్లా కడప అభివృద్ధిని పట్టించుకోకపోవడం అన్యాయమని, ఏముఖం పెట్టుకొని ఆయన బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్నారని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. అధికారం చేపట్టి దాదాపు నాలుగేళ్లవుతున్నా జిల్లాకు ఒక్క ప్రాజెక్టుగానీ, పరిశ్రమగానీ తేలేదన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో కెసి కెనాల్ స్థిరీకరణ కోసం ఉద్దేశించబడిన రాజోలి రిజర్వాయర్, ఆదినిమ్మాయపల్లి ఆనకట్టగానీ కేవలం శంఖుస్థాపనలకే పరిమితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వీధివాసులకు ఇబ్బందిలేకుండా చూడాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వీధివాసులకు ఇబ్బందిలేకుండా చూడాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణ పరిధిలోని 22వ వార్డులో మురికినీటి కాలువ మరమ్మతులకు గురికావడంతో దుర్వాసన వెదజల్లుతూ స్థానికులకు ఇబ్బందిని కలిగిస్తోంది. సమస్యను వార్డు ఇన్‌ఛార్జి హిదాయతుల్లా వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మంగళవారం స్వయంగా పరిశీలించారు.

మేధావులనే పంపిద్దాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మేధావుల సభలోకి మేధావులనే పంపిద్దామని, ఆ దిశగా పోరాడే పిడిఎఫ్ బలపరుస్తున్న కడప, కర్నూల్, అనంతపురం పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుని ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. పట్టణంలో ప్రయివేట్ విద్యా సంస్థల్లో కరెస్పాండెంట్లను, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ శాసన మండలిలో నిరుద్యోగ, కార్మికుల, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలంటే ఇలాంటి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, డివైఎఫ్ఐ సతీష్, రాఘవ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

కాంగ్రెస్ దళిత పక్షపాతి సంజీవయ్య

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అసలు సిసలైన కాంగ్రెస్ వాది కావడంతోపాటు కాంగ్రెస్ దళిత పక్షపాతి అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో దామోదరం సంజీవయ్య జయంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య నిరాడంబరుడు, ఆదర్శ ప్రాయుడు అని కొనియాడారు. కాంగ్రెసు పార్టీ జాతీయ అధ్యక్షుడుగా పార్టీ పురోభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 38 ఏళ్ల పిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సంజీవయ్య పదవి చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఉత్తన్న, ధ్రువకుమార్‌రెడ్డి, చెన్నకేశవ, రామకృష్ణ, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, శివ, అమర్, బద్రీ, రాఘవయ్య పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తు తులసిరెడ్డి

చెముళ్లపల్లెను సందర్శించిన డిఎంహెచ్ఒ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని చెముళ్లపల్లె గ్రామాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.నాగరాజు సందర్శించారు. 'చెముళ్లపల్లెలో విష జ్వరాలు.. ఆందోళనలో ప్రజలు' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. ఇందుకు జిల్లా వైద్య ఉన్నత శాఖ అధికారుల స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు గ్రామంలో పర్యటించి జ్వరాలపై ఆరా తీశారు. డెంగీ కేసు నమోదైన ఇంటిని సందర్శించి, యజమానికి ధైర్యం చెప్పారు. రాత్రివేళ దోమతెరలు ఖచ్చితంగా వాడుకోవాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారా మెడికల్ ఆఫీకారి నాగన్న, కడప సబ్ యూనిట్ అధికారి కె.లక్షుమయ్య, కడప ఎపిడమిక్ ఇన్‌ఛార్జి కె.ఎస్.వి.ప్రసాద్, ఖాజీపేట మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్స్ సునీల్‌కుమార్, కృష్ణప్రియ పాల్గొన్నారు.



జ్వరాలపై ఆరాతీస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

'పది' మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ కడప జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞా వికాసం పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల డిసిఇబి కార్యదర్శి శోభరాణి తెలిపారు. ఆ మేరకు మంగళవారం కరపత్రాలను డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షను ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అభినందించారు. పరీక్ష రాసే వారు ఎంట్రీ ఫీజు రూ.30 చెల్లించాల్సి ఉందన్నారు. పాఠశాల సిబ్బంది సరస్వతి, ఎమ్ఆర్‌సి రాంమోహన్, ఎస్ఎఫ్ఐ ఇమామ్, మోహన్ పాల్గొన్నారు. వివరాలకు 99129 21048 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శోభరాణి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

సజావుగా సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో రెండవ వైస్ ఎంపిపి రెడ్డమ్మ ఆధ్వర్యంలో ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. అధికారులు వారి పరిధిలో జరుగుతున్న పనులను ఈ సమావేశంలో వివరించారు.

క్రైం కార్నర్

మేకలు చేలో పడ్డాయని గొడ్డలితో దాడి

ప్రజాశక్తి - కాశినాయన

నరసాపురం గ్రామానికి చెందిన షేక్ చిన్న పీరయ్య అనే వ్యక్తి రోజుటి మాదిరిగానే తన మేకలను తోలుకుని ఓబులాపురం సమీపంలోని బీడు పొలాల వైపు వెళ్లాడు. పైరు లేని బీడు పొలాల్లో మేకలు మేస్తుండగా, పక్కన ఉన్న రామ్మోహన్‌రెడ్డి అనే వ్యక్తి వచ్చి తన పొలంలో మినుము మీ మేకలు మేశాయని దాడి చేశాడు. తమ మేకలు కాదని ఎంత బతిమలాడినా వినకుండా పీరయ్య చేతిలోని గొడ్డలిని లాక్కొని దాడి చేశాడు. ఆ మేరకు పీరయ్య ఫిర్యాదు చేయగా నరసాపురం పోలీసులు పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుడి భార్య, బంధువులు కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.